క్లుప్తంగా

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

వీరవాసరం: గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటానని భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు తెలిపారు. వీరవాసరం మండలంలోని మత్స్యపురిలో బుధవారం పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రోడ్లకు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మత్స్యపురి గ్రామానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ గ్రాంట్ నిధులు రూ.37 లక్షల నిధులు కేటాయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని, జెడ్పీటీసీ గుండా జై ప్రకాష్ నాయుడు, జవ్వాది బాలాజీ డి ఈ స్వామి నాయుడు ఎండిఓ కే కిరణ్ కుమార్, తాసిల్దార్ ఏవి రామాంజనేయులు , ఏపీఓ కె. జ్యోతి రాణి, మండల స్థాయి అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కాపు, బలిజ సంక్షేమ సేన జిల్లా అధ్యక్షుడిగా రామకృష్ణ

వీరవాసరం: కాపు, బలిజ సంక్షేమ సేన జిల్లా అధ్యక్షుడిగా గుండా రామకృష్ణను నియమించినట్లు ఆయన బుధవారం విలేకర్లకు తెలిపారు. సంక్షేమ సేన ఫౌండర్ ప్రెసిడెంట్ చేగొండి హరిరామ జోగయ్య, గౌరవ అధ్యక్షుడు బొలిశెట్టి సత్య, కార్యవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో జిల్లా ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి కార్యచరణ నిర్ణయిస్తామన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జరిమానా

భీమవరం: పట్టణంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్టోబర్ 3వ తేదిన నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి కోర్టు జరిమానా విధించినట్లు సీఐ జి.కాళీచరణ్ తెలిపారు. భీమవరం స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రూ.10 వేలు జరిమానా విధించారన్నారు. మద్యం సేవించి ఎవరైనా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

4 వార్డులో శానిటేషన్ పనుల పరిశీలన

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలోని 4వ వార్డు నరసయ్యాగ్రహారంలో బుధవారం మునిసిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి శానిటేషన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వార్డు సచివాలయ సిబ్బందితో మాట్లాడతూ వార్డులలో సేకరించే చెత్తను విడివిడిగా వాహనాలకు అందజేయాలని సూచించారు. వర్షాల దృష్ట్యా లోతట్టు ప్రాంతాలలో ఎప్పటికప్పుడు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్, పారిశుధ్య సిబ్బందికి తగు సూచనలు జారీ చేశారు. ఖాళీ స్థలముల యాజమానులకు నోటీసులు జారీ చేసి ఎప్పటికప్పుడు చెత్తను తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేదించేల నోటీసులు జారీ చేసి ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని సచివాలయం సిబ్బందికి అదేశాలు జారీ చేశారు.

ప్రయాణికుల సెల్‌ఫోన్లు రికవరీ



భీమవరంలో రికవరీ చేసిన సెల్‌ఫోన్లు అందజేస్తున్న దృశ్యం

భీమవరం : రైళ్లల్లో ప్రయాణికులు పోగొట్టున్న 5 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి ఫిర్యాదుదారులకు అందజేశామని జీఆర్‌పీ ఎస్సై పి.టి.వి రమణ అన్నారు. భీమవరం రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన మొబైల్ మిస్సింగ్ కేసుల్లో సీఈఐఆర్ యాప్ ద్వారా ఫోన్లు రికవరీ చేసి అందించామన్నారు. వీటి విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని ఎస్సై తెలిపారు.

నేటి నుంచి ఉపవాస కూడికలు

పాలకోడేరు: మోగల్లు సెయింట్ పాల్ లూథరన్ చర్చి వద్ద గురువారం నుంచి శుక్రవారం వరకు ఆశీర్వాద ఉపవాస కూడికలు నిర్వహించనున్నట్లు సంఘ కాపరి గోపే సాల్మన్‌రాజు తెలిపారు. ఈ కూడికలు ప్యారిస్ పాస్టర్ రెవరెండ్ వై.జయరాజ్ ప్రారంభిస్తారని ప్యారిస్ పరిధిలో ఉన్న సంఘాలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ ఉపవాస కూడికలకు రాయకుదురు, దిరుసుమర్రు కొరప్రాడు తదితర గ్రామాల నుంచి దైవజనులు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు.

నేడు హుండీల లెక్కింపు

కాళ్ల: కాళ్లకూరులో వేంచేసియున్న స్వయంభు శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం ఉదయం స్వామి వారి హుండీల లెక్కింపు కార్యక్రమం నిర్వహిస్తున్నామని దేవస్థానం ఈవో ఎం.అరుణ్‌కుమార్ బుధవారం తెలిపారు. దేవదాయ ధర్మాదాయ శాఖ భీమవరం తనిఖీదారు, గ్రామస్తులు, భక్తుల సమక్షంలో స్వామి వారి హుండీలు తెరిచి లెక్కిస్తామని ఆయన స్పష్టం చేశారు.

నేడు పల్లె పండుగ ప్రారంభం

మొగల్తూరు: పల్లె పండుగ–పంచాయతీ వారోత్సవాలను గురువారం మండలంలోని రెండు గ్రామాల్లో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో త్రిశూల పాణి బుధవారం తెలిపారు. కొత్తోట, రామన్నపాలెం గ్రామాల్లో నిర్వహించే కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారన్నారు.

ప్రమాదపుటంచున గ్రామాలు

- బలహీనమైన కాలువ, డ్రెయిన్ గట్లు
- గ్రామాలకు పొంచి ఉన్న ముప్పు



ఉండి కాలువకు ఇసుక బస్తాలు అడ్డుకడుతున్న దృశ్యం (ఫైల్)



ఇళ్లలోకి వస్తున్న వరద నీటికి అడ్డుకట్ట వేస్తున్న దృశ్యం (ఫైల్)

ఉండి: ఇటీవల తుఫాను హెచ్చరికల నేపథ్యంలో ముఖ్యంగా ఉండి పంట కాలువ, యనమదుర్రు డ్రెయిన్ల ఒడ్డున ఉండే గ్రామాలు ప్రమాదపుటంచున కొట్టిమిట్టాడుతున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ఉండి పంట కాలువ, యనమదుర్రు డ్రెయిన్లు పొంగిపొర్లాయి. దీంతో వాటిని అనుకొని ఉన్న గ్రామాల ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. గట్లపై నుంచి నీరు ప్రవహించడంతో చాలా వరకు వరిచేలు ముంపునకు గురయ్యాయి. అంతే కాకుండా ప్రజలు కూడా ఉప్పొంగుతున్న ఉండి పంట కాలువ, యనమదుర్రు డ్రెయిన్‌ల వల్ల ముప్పు పొంచి ఉందంటూ తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలే ప్రమాదానికి సూచనగా కనిపించాయి. ఇదిలా ఉండగా తాజాగా చేసిన తుఫాను హెచ్చరికల నేపథ్యంలో మండలంలోని యండగండి, మహదేవపట్నం, ఎన్నార్పీ అగ్రహారం, ఉండి, కలిసిపూడి, చెరుకువాడ గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. యండగండిలో వైఎస్సార్ కాలనీతో పాటు ఎస్సీ కాలనీ, వంతెన సమీపంలోని ఇళ్లు, ఎన్నార్పీ అగ్రహారంలోని ఎస్సీ, బీసీ కాలనీలతో పాటు ప్రధాన గ్రామంలోకి కూడా వరదనీరు చేరింది. అలాగే ఉండి తోట ప్రాంతంలోని ఎస్సీ కాలనీలోకి కాలువగట్టుపై నుంచి వరద నీరు వీధుల్లోకి చేరడంతో సుమారు రెండు రోజులే స్థానికులు, అధికారులు నిద్ర లేకుండా ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని భయం గుప్పెట్లో విలవిలలాడిన సంఘటనలు ఇటీవల అనేకం చోటు చేసుకున్నాయి. గతంలో ఉండి ఇరిగేషన్ కార్యాలయానికి ఎదురుగా ఉండి కాలువకు గండి పడటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అలాగే ఉండిలోని నిమ్మలపేట,గోరింతోట, ప్రాంతాలతో పాటు కలిసిపూడి గ్రామం, చెరుకువాడలోని పలు ప్రాంతాలు కూడా ఉండి కాలువ ద్వారా ముంపు ప్రమాదాన్ని చవి చూశాయి. అయితే ఇప్పుడైనా అధికారులు మేల్కొని యండగండి నుంచి చెరుకువాడ వరకు అలాగే యనమదుర్రు డ్రెయిన్ ప్రమాదం పొంచి ఉన్న ఉణుదుర్రు, యండగండి, పాలకోడేరు మండలంలోని పాలకోడేరు, గొల్లలకోడేరు, గరగపర్రు గ్రామాలు కూడా అత్యంత ప్రమాదంలో ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో గట్లు బలోపేతం చేసేందుకు యుద్ధ ప్రాతి పదికన చర్యలు చేపట్టకపోతే పెను ప్రమాదాలు సంభవించే పరిస్థితి నెలకొంటుందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గట్లు బలోపేతం చేయండి



మా గ్రామం చుట్టూ ఉండి కాలువ, మరో వైపు యనమదుర్రు డ్రెయిన్ ఉండటంతో ఎప్పుడు ప్రమాదం వస్తుందో తెలియక భయంతో బ్రతుకుతున్నాం. అధికారులు దయచేసి క్షేత్రస్థాయిలో పరిశీలించి గట్లు బలహీనంగా ఉన్న ప్రాంతంలో బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టాలి.

వెలగపల్లి టోనీ, యండగండి

బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నాం



గత కొద్ది రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు ఉండి తోట ఎస్సీ ఏరియాలోకి ఉండి కాలువ పొంగి నీరు ఇళ్లలోకి రావడంతో పిల్లలతో కలిసి భయభ్రాంతులకు గురయ్యాం. ఈ భయం నుంచి తేరుకోక ముందే మరో తుఫాను హెచ్చరికలతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నాం.

పారుపూని రాహుల్, ఎన్నార్పీ అగ్రహారం

23 మద్యం షాపుల ప్రారంభం

ఆకివీడు: ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో 23 మంద్యం దుకాణాలు బుధవారం ప్రారంభించారని ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాసరావు చెప్పారు. నగర పంచాయతీ, రూరల్ ప్రాంతంలో 10, కాళ్ల మండలంలో 9 షాపులు, నాలుగు ఉండి మండలంలో ప్రారంభించారని వివరించారు.

నేడు ఆక్వా రైతులకు అవగాహన

ఉండి: మండలంలోని ఎన్నార్పీ అగ్రహారం కృషీ విజ్ఞాన కేంద్రంలో గురువారం ఉదయం చేపలు, రొయ్యల వ్యాధుల యాజమాన్యంపై విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్లకు అవగాహన, శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.మల్లిఖార్జునరావు తెలిపారు. కార్యక్రమానికి విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్లు హాజరై సద్వినియోగ పరచుకోవాలని ఆయన తెలిపారు.

నేడు బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా సమావేశం

ఉండి: బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా (బీఎస్ఐ) ఆకివీడు బ్రాంచ్ సమావేశాన్ని గురువారం ఉండి మండలం చెరుకువాడ చర్చ్ ఆఫ్ క్రైస్ట్ ప్రార్థనా మందిరంలో నిర్వహిస్తున్నట్లు బ్రాంచ్ అధ్యక్షుడు డాక్టర్ ఈలి డేవిడ్‌మార్క్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఎస్ఐ రాష్ట్రాధ్యక్షుడు బ్రదర్ మేడిద జాన్సన్ హాజరవుతారని తెలిపారు. సాయంత్రం 3 గంటల నుంచి 6 గంటల వరకు జరిగే ఈ సమావేశానికి బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా (బీఎస్ఐ)కు సహకరించిన వారు హాజరు కావాలని తెలిపారు.

క్లాప్ డ్రైవర్లు ఆందోళన విరమించాలి



క్లాప్ డ్రైవర్లతో చర్చిస్తున్న అధికారులు

భీమవరం : ప్రభుత్వంతో సంప్రదింపులు జరుగుతున్నాయని క్లాప్ డ్రైవర్స్ తమ ఆందోళనలను విరమించి విధులకు హాజరుకావాలని అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. తమ అపరిష్కృత సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ గత వారం రోజులుగా విధులు బహిష్కరించి ఆందోళన చేస్తున్న క్లాప్ డ్రైవర్స్ యూనియన్ నాయకులను అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ బుధవారం కలిసి విధుల్లో హాజరుకావాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాన్ని రోల్ మోడల్ గా నిలపడంలో పారిశుద్ధ్య కార్మికులు, క్లాప్ డ్రైవర్స్ పాత్ర ఎంతో ఉందని గత కొద్దిరోజులుగా క్లాప్ డ్రైవర్స్ విధులకు రాకపోవడం ఇబ్బందులు వస్తున్నాయని, క్లాప్ డ్రైవర్స్‌కు న్యాయం చేయడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని వెంటనే విధులకు హాజరు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో క్లాప్ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు రాజు, కార్యదర్శి శివ ఆర్.రమణ, దైవ రాజు, బి.శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

రైతాంగాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న మంతెన సీతారాం

భీమవరం: సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సమావేశం భీమవరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రభుత్వం రంగంలోనే నడుపుతామని కేంద్ర ప్రభుత్వం వెంటనే ప్రకటించాలన్నారు. దీనిపై నిర్ణయం చెప్పకుండా తాత్సారం చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా కేంద్రంపై ఒత్తిడి తీసుకు రావాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు, కూరగాలు, వంటనూనె, వంటగ్యాస్, ఇందన ధరలు విపరీతంగా పెరిగాయని, ప్రభుత్వం వెంటనే ధరల నియంత్రణ చేపట్టాలన్నారు. అధికారంలోకి వస్తే ధరలు నియంత్రిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక ప్రభుత్వం మాట్లాడకపోవడం దారుణమన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలపై, నిత్యావసర వస్తువుల ధరలపై దృష్టి పెట్టాలని కోరారు. భారీ వర్షాల వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. ఉచిత ఇసుక హామీని నెరవేర్చి కుదేలైన నిర్మాణ రంగాన్ని కాపాడాలని దానిపై ఆధారపడిన వేలాది మంది కార్మికులకు ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో జేఎవీ గోపాల, చింతకాయల బాబూరావు, కేతా గోపాల్, కర్రి నాగేశ్వరరావు, కవురు పెద్దిరాజు, పీవీ ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన తపాలా వారోత్సవాలు



ఉత్తమ సేవ సత్కారాలు అందుకున్న తపాల శాఖ సిబ్బంది

భీమవరం (ప్రకాశం చౌక్): పోస్టుమెన్ సేవలు అద్వితీయమని, తపాల శాఖలో పోస్టుమెన్ పాత్ర కీలకమని మున్సిపల్ కమిషనర్ కె రామచంద్ర రెడ్డి అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, తపాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భారత తపాల శాఖ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ రామచంద్రరెడ్డి మాట్లాడుతూ పోస్టుమెన్‌లు, అధికారుల్లో ఉత్తమ సేవలు అందించేవారిని సత్కరించడం అభినందనీయమన్నారు. సత్కరాలు అందుకున్న వారు ఉద్యోగులకు స్ఫూర్తిగా నిలుస్తారన్నారు. ఈసందర్భంగా ఉత్తమ సేవలు అందించిన నాలుగురు ఉద్యోగులను 12 మంది ఉత్తమ పోస్ట్ మెన్లను తపాల శాఖ ప్రధాన కార్యాలయంలో సత్కరించారు. తపాల వారోత్సవాల్లో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన 31 మంది విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

వసతి గృహంలో తనిఖీలు



వసతి గృహంలో వసతులపై ఆరా తీస్తున్న న్యాయమూర్తి ధనరాజు

భీమవరం: వసతి గృహల్లో సౌకర్యాలపై భీమవరం 2వ అదనపు జ్యుడీషియల్ మొదటి తరగతి మేజిస్ట్రేట్ డి.ధనరాజు బుధవారం తనిఖీలు చేశారు. మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో పలు సాంఘిక వసతి గృహాలను ఆయన పరిశీలించారు. స్థానిక కోడవల్లి రోడ్డులోని ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహాన్ని, శివరావు పేటలోని ప్రభుత్వ ఎస్సీ కళాశాల బాలుర వసతి గృహాన్ని, కాళ్ల గ్రామం బీసీ కాలనీలో ఉన్న ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సందర్శించి పిల్లలకు అందుతున్న మౌలిక వసతుల గురించి, హాస్టళ్లకు అవసరమైన సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు.

కన్నుల పండువగా వెంకన్న కల్యాణం



కాళ్లకూరు వేంకటేశ్వరస్వామికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కాళ్ల: గోవింద నామస్మరణతో కాళ్లకూరు మార్మోగింది. కాళ్ల మండలం కాళ్లకూరులో వేంచేసియున్న స్వయంభు శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆశ్వయుజమాస లఘు (చిన్న) కల్యాణ మహోత్సవం బుధవారం రాత్రి కన్నుల పండువగా నిర్వహించారు. శ్రీమాన్ అరంగంటి ఝాన్సీలక్ష్మి కుమారులచే ఆలయ అర్చకులచే వేద పండితులు అనిపెద్ది ఫణికుమార్ శర్మ ఆధ్వర్యంలో వేద మంత్రాల నడుమ అత్యంత వైభవంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవ కార్యక్రమానికి జిల్లా నలు మూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ నిర్వహించారు. పెళ్లిళ్ల సీజన్ కావటంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను దేవస్థానం కార్య నిర్వహణ అధికారి ఎం.అరుణ్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రహదారులు ఇలా.. ప్రయాణం ఎలా?



కాళ్లకూరు వద్ద అధ్వానంగా ఉన్న రహదారి



కాళ్ల పోలీస్ స్టేషన్ సమీపంలో వర్షపు నీటితో నిండిపోయిన రహదారి

- అధ్వానంగా జువ్వలపాలెం రహదారి
- హడలెత్తిపోతున్న ప్రయాణికులు

కాళ్ల: జువ్వలపాలెం రాష్ట్రీయ రహదారి అధ్వానంగా మారింది. అడుగడుగునా భారీ గోతులతో ప్రమాదకరంగా తయారయింది. కాళ్ల మండలంలో రాష్ట్రీయ రహదారి పరిధిలో పెదఅమిరం నుంచి ఏలూరుపాడు వరకు రహదారి మొత్తం ఛిద్రంగా మారింది. ఆ రహదారి ప్రయాణం అంటేనే ప్రయాణికులు భయపడే పరిస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వ హయాంలో మరమ్మతులు చేసినప్పటికీ ఇటీవల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు రాష్ట్రీయ రహదారి మరింత అధ్వానంగా తయారైంది. రోడ్లపై ఉన్న భారీ గోతుల్లో వర్షపు నీరు నిలబడటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనదారులు గోతుల్లో పడి ప్రమాదాలు సంభవించిన సంఘటనలు లేకపోలేదు. ప్రధానంగా రాష్ట్రీయ రహదారిని ఆనుకొని మండలంలో పెద అమిరం, కోపల్లె, జక్కరం, సీసలి, కాళ్ల, దొడ్డనపూడి, కాళ్లకూరు, జువ్వలపాలెం, ఏలూరుపాడు గ్రామాల పరిధిలో రహదారి మరింత అధ్వానంగా ఉంది. కనీసం అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు, ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. రాత్రి సమయంలో గోతుల్లో వర్షపు నీరు నిలబడటంతో ఎటువైపు ప్రయాణించాలో తెలియక ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా కాళ్లకూరు వెంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో, మండల కేంద్రమైన కాళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో, దొడ్డనపూడి గ్రామం వద్ద భారీ గోతులు ఏర్పడ్డాయి. కొద్దిపాటి వర్షానికి మీ భారీ గోతుల్లో వర్షపు నీరు నిలవడంతో రహదారి కాలువను తలపిస్తుంది. ఏలూరుపాడు నుంచి భీమవరం వెళ్లాలంటే అరగంటలో వెళ్లే ప్రయాణం ఇప్పుడు గంటల సేపు ప్రయాణించాల్సి వస్తుంది ప్రయాణికులు వాహనదారులు వాపోతున్నారు. ఈ గోతుల్లో పడి వాహనాలు కూడా దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాలు సంభవించకుండా తాత్కాలిక మరమ్మతులైనా చేయాలని కోరుతున్నారు.

అంతర్గత రహదారులూ ఇదే పరిస్థితి

మండలంలో రాష్ట్రీయ రహదారితో పాటు పలు గ్రామాల్లో ఉన్న అంతర్గత ఆర్‌అండ్‌బీ రహదారులు సైతం భారీ గోతులతో అధ్వానంగా ఉండటంతో ప్రజలు, వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా వేంపాడు ఆర్‌అండ్‌బీ రహదారి, కాళ్ల నుంచి కోలనపల్లి వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి, కలవపూడి శివారు మోడీ, పల్లెపాలెం నుంచి ఎస్సీ బోస్ కాలనీలకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారులు గోతులమయమై ప్రయాణానికి తీవ్ర ఆటంకంగా ఉన్నాయి.

అంగరంగ వైభవంగా అమ్మవారి ఊరేగింపు



గంగానమ్మ, మద్దిరావమ్మ ఆలయం వద్ద కనకదుర్గమ్మ ఊరేగింపు



శక్తి వేషధారణలతో అమ్మవారి ఊరేగింపు దృశ్యం

ఆకివీడు: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల ముంగింపు సందర్భంగా స్థానిక మాదివాడలోని గంగానమ్మ, మద్దిరావమ్మ అమ్మవార్ల ఆలయం వద్ద ఏర్పాటు చేసిన దుర్గమ్మను బుధవారం అంగరంగ వైభవంగా ఊరేగించారు. గరగ నృత్యాలతో అమ్మవారికి బండారి చల్లారు. అందంగా అలంకరించిన వాహనంలో అమ్మవారిని ఉంచి గ్రామంలో ఊరేగించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మోటుపల్లి రాజు, కౌన్సిలర్ మోటుపల్లి కుమారి మాట్లాడుతూ దసరా మహోత్సవాల సందర్భంగా 31వ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. వచ్చే నెల కార్తీక మాసం మొదటి శుక్రవారం సందర్భంగా 8వ తేదీన అఖండ అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు. నవరాత్రులు నిర్వహించడం ద్వారా గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో జీవిస్తున్నారని చెప్పారు.

నిత్యావసర ధరలు తగ్గించాలి

భీమవరం అర్బన్: నిత్యావసర ధరలు తగ్గించి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 14 రకాల సరుకులు అందజేయాలని సీపీఎం పార్టీ మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. భీమవరం మండలంలోని వెంపలో బుధవారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పెరిగిన నిత్యావసర ధరలు తగ్గించాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకి వస్తే అధిక ధరలను అరికడతామని చెప్పి వంద రోజులు అవుతున్నా తగ్గించకపోగా మరింత పెంచి పేదల నడ్డి విరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో ఉపాధి లేకపోవడంతో ఆదాయం రాక జీవనోపాధి కడుదుర్భరంగా గడుపుతున్నారని వాపోయారు. ఈ కార్యక్రమంలో మందా యాకోబు, వర్ధనపు కన్నమ్మదాసు, పండు, భూపతి శామ్యేయేలు, మందా కుటుంబరావు, రాజు, బొబ్బనపల్లి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఆహార పొట్లాల పంపిణీ



పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం : ప్రపంచ ఆహార దినోత్సవ సందర్భంగా విజ్ఞాన వేదిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గొల్లవాని తిప్ప రోడ్డులోని, డంపింగ్ యార్డ్ వద్ద ప్రకాష్ నగర్ కాలనీలలోని యానాది కుటుంబాలకు ఆహార పొట్లాలు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు అల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ పుట్టిన ప్రతి మనిషికి ప్రధానంగా ముందు ఆహారం తర్వాత దుస్తులు, నివాసం అవసరమని, మనకు అవసరమయ్యే ఆహారాన్ని పండించడానికి రైతులకు నెలలు, సంవత్సరాలు పడుతుందని, పెరుగుతున్న జనాభా, తరుగుతున్న ఆహార నిల్వలు ఆకలి చావులకు ప్రధాన కారణమని, అందరికీ ఆహారం అందించడమే ప్రపంచ ఆహార దినోత్సవ లక్ష్యమని, ప్రతి ఒక్కరూ ఆహారాన్ని వృధా కాకుండా మిగిలినటువంటి పదార్థాలను నిరుపేదలకు అందజేయాలని తెలిపారు. ఈ సందర్భంగా కొత్త చంద్రశేఖర్ సౌజన్యంతో 100 మంది యానాది కుటుంబాలకు రెండు ప్రాంతాల్లో భోజనం ప్యాకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అరసవల్లి మణికంఠ వెంకటేష్, వాల్మీకి బాలాజీలు పాల్గొన్నారు.